epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 126 | ఆదివారం | 06.10.2024

# హైడ్రాకు ఫుల్ పవర్స్

## ఆర్డినెన్స్ ను ఆమోదించిన గవర్నర్

**హైదరాబాద్ , మన చౌరాస్తా :** హైదరాబాద్ విపత్తు స్పందన, ఆస్తుల పర్యవేక్షణ, పరిరక్షణ ఏజెన్సీ(హైడ్రా) కి విస్తృతాధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపారు. ఈ మేరకు శనివారం రాజ్ భవన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఇకపై హైడ్రా చేపట్టబోయే అన్ని కార్యకలాపాలకు చట్టబద్ధత లభించింది. ఏ చట్టం ప్రకారం ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందన్న ప్రశ్నలు తలెత్తడంతో.. జీహెచ్ఎంసీ చట్టం 1955ను సవరించింది. నగరంలోని జలాశయాలు, ఇతర ఆస్తులను కాపాడేందుకు అధికారిని లేదా సంస్థను ఏర్పాటు చేసే అధికారాన్ని ప్రభుత్వానికి కట్టబెడుతూ.. జీహెచ్ఎంసీ చట్టంలో కొత్తగా 374 బి సెక్షన్‌ను చేర్చింది. ఆ అర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ ఆర్డినెన్స్ తో హైడ్రా మరింత బలోపేతంకానుంది. ఈ చట్టాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు హైడ్రాకు ఈ ఆర్డినెన్స్ రక్షణగా ఉండనుంది.



ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్‌పై గవర్నర్ పలు సందేహాలు వ్యక్తం చేయగా.. పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ నివృత్తి చేయడంతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. చెరువులు, కుంటలు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు, ఆట స్థలాలు సహా ప్రభుత్వ ఆస్తుల్ని సంరక్షించడంతో పాటు ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్షణ చర్యలు, భారీ వర్షాలు కురిసినప్పుడు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని క్రమబద్ధీకరించడం, అగ్నిమాపకశాఖ సేవలకు ఎన్‌వోసీ జారీచేయడం తదితర లక్ష్యాలతో జులై 19న జీవో ఎం.ఎస్ 99 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసింది. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాన్ని హైడ్రా పరిధిలో చేర్చారు. హైడ్రా ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విభాగం, విపత్తు నిర్వహణ విభాగాలు ఇప్పటికే పనిచేస్తుండగా.. ఆర్డినెన్స్‌తో మరిన్ని కీలక అధికారాలు హైడ్రాకు దఖలు పడ్డాయి. ఆ విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇటీవలే పలువురు ఉన్నతాధికారులు సిబ్బందిని ప్రభుత్వం కేటాయించింది.



## కాలేజీల్లో సంబురాలు

- ఉట్టిపడిన తెలంగాణ సంస్కృతి
- ఆకట్టుకున్న ఉయ్యాల పాటలు

-లోపలి పేజీల్లో...



## 2 ఎల్ఆర్ఎస్‌ను స్పీడప్ చేయాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా




## 3 ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

- సీపీఎం నేత వెంటమావో



## 4 దేవరుప్పలలో కేరళా బృందం

- సాయుధ పోరాట కేంద్రాల సందర్శన

General News



# ఎల్ఆర్ఎస్‌ను స్పీడప్ చేయాలి

- **ప్రతి సర్వే నంబర్‌ను క్షేత్రస్థాయి పరిశీలించాలి**
- **కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా**

**జనగామ , మన చౌరాస్తా :** భూముల లేఅవుట్ క్రమబద్ధీకరణకు సంబంధించి దాఖలైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మున్సిపాలిటీ కి సంబందించిన ఎల్ఆర్ఎస్ సర్వే ప్రక్రియ వేగవంతం కోసం చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత రెవెన్యూ, నీటిపారుదల, మునిసిపల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించుకొని, దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో సక్రమంగా నమోదు చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిష్కరించే ముందు అవి ప్రైవేటు స్థలమేనా , ప్రభుత్వ స్థలమా అనేది నిర్ధారించుకోవాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లడానికి ముందే దరఖాస్తుదారులకు సమాచారం అందిస్తే, వారు ప్లాట్ స్థలంలో అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ లో, ఆర్డీఓ కార్యాలయం లో ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలన్నారు జనగాం మున్సిపాలిటీ కి సంబందించి(12,552) అప్లికేషన్ లు వచ్చాయని, ఇందులో 144 అప్లికేషన్ లకు చెందిన సర్వే పూర్తయ్యిందని, మొత్తం ఎల్ఆర్ఎస్ ప్రక్రియ డిసెంబర్ లోగా పూర్తికావాలని సూచించారు. ఏ సర్వే నంబర్ కు ఎక్కువ అప్లికేషన్ లు ఉంటాయో అక్కడికి మున్సిపల్, ఇరిగేషన్, రెవిన్యూ బృందం అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించాలన్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ కు వచ్చిన సర్వే నంబర్ లన్నీ క్రమ పద్ధతిలో ట్రాకింగ్ షీట్ ఒకటి పెట్టుకొని, ఎంత మంది దరఖాస్తుదారులు స్పందించారు, బృంద సందర్శన ఎప్పుడు అయ్యింది, పేమెంట్ అయ్యిందా? లేదా? తదితర వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఆ ట్రాకింగ్ షీట్ లో నమోదు చేసుకుంటేనే ప్రతి రోజూ ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పర్యవేక్షణ పక్కాగా జరిగి, ఎల్ఆర్ఎస్ పూర్తవ్వడానికి దోహదపడుతుందన్నారు. ఈ సమీక్ష సమావేశంలో జనగామ ఆర్డీఓ కొమురయ్య, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్, నీటిపారుదల, పంచాయతీ శాఖకు సంబంధించిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి టీచర్ ఓటరుగా నమోదు చేసుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, వరంగల్‌ఖమ్మంనల్లగొండ ఉపాధ్యాయ ఎంఎల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హత కలిగిన ఉపాధ్యాయుల కోసం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మూడు ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారి కార్యాలయం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఏ, ఆర్ఆర్, యూనిట్ 1), మీడియా కేంద్రం (ఐడీఓసీ) లో అర్హత కలిగిన అందరు ఉపాధ్యాయ ఓటర్లు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే జిల్లాలో ఉపాధ్యాయులందరూ వంద శాతం ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా జనగామ, ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాలు, ఎంఈఓ కార్యాలయాల్లో కూడా ఓటరు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఆయా మండలాల పరిధిలో అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ ఓటరు నమోదు కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ మృతి

### నివాళులర్పించిన పుర ప్రముఖులు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణ ప్రముఖులు విశ్రాంత ఉపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ చార్టర్ సభ్యుడు, పూర్వ రీజియన్ చైర్మన్ లయన్ మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ (72) మృతి చెందారు. కొద్ది రోజులుగా అస్వస్థతతో ఉన్న గౌస్ భాయి శనివారం తెల్లవారు జామున హైదరబాద్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహం ఉదయం 9 గంటలకు జనగామ బాలాజీ నగర్ లోని వారి స్వగృహానికి తీసుకురాగా బంధుమిత్రులు, స్నేహితులు అంతిమంగా సందర్శించి నివాళులర్పించారు. ప్రస్తుతం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనగామ మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇవాన్ డగ్లస్ ఎయిడెడ్ పాఠశాలలో హిందీ పండిట్ గా పనిచేసి ముందస్తు పదవీ విరమణ చేసిన గౌస్ పట్టణంలో రెండు దశాబ్దాల కింద చైతన్య జూనియర్ కళాశాల స్థాపించి విద్యారంగంలో సేవ చేశారు. జనగామ పట్టణం హైదారాబాద్ రోడ్డులో గల బిళాల్ మసీద్ పాలకమండలి అధ్యక్షుడిగా ఎన్నికై రెండు పర్యాయాలు సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించి ఆధ్యాత్మిక రంగంలోనూ ప్రశంసలందుకున్నారు. ఆయన గృహం నుంచి అంతిమ యాత్ర బయలు దేరి గిర్నిగడ్డ ఖబరస్థాన్ లో ఖననంతో అంత్యక్రియలు ముగిశాయి. సేవా రంగంలో కలిసి పని చేసిన ఆత్మీయ సోదరుడు గౌస్ మొహియుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని, దుఃఖిత కుటుంబ సభ్యులకు ఓదార్పు కలిగించాలని భగవంతున్ని ప్రార్థిస్తూ లయన్స్ సమాజంలోని అనేక మంది నాయకులు, పురప్రముఖులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. మొహియుద్దీన్ కు భార్య ఖమరున్నీస, కుమారులు మహమ్మద్ గయాస్, మహమ్మద్ ఆవేస్, మహమ్మద్ సజ్జాద్, కుమార్తెలు ఫరహత్, డా. మున్నవర్ ఉన్నారు. జనగామ పట్టణంలో అందరివాడుగా మెదిలి దివంగతుడైన మహమ్మద్ గౌస్ మొహియుద్దీన్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసి శ్రద్ధాంజలి ఘటించిన వారిలో లయన్స్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకట్ రెడ్డి, వైస్ జిల్లా గవర్నర్లు డా. చంద్రశేఖర్ ఆర్య, ఎన్.సుధాకర్ రెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్లు కన్న పరశురాములు, కొత్తపల్లి జాన్ బన్నీ, రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా చైర్మన్ డా. డి.లవకుమార్ రెడ్డి, జిల్లా చైర్మన్లు పి.హరికిషన్ రెడ్డి, ఆర్.రమణారెడ్డి, రీజియన్ చైర్మన్ కలువల భాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వై. సుధాకర్, విద్యాసంస్థ ల నాయకులు ఇ. ప్రభాకర్ రెడ్డి, చిర్రా ఉపేందర్ రెడ్డి, బార్ అసోసియేషన్ నాయకులు వి. ప్రసాద్ రావు, ఏ. బిక్షపతి, పుర ప్రముఖులు జే. సోమిరెడ్డి, ఫజ్జూరి లక్ష్మినర్సయ్య, ఎం డి. దస్తగిరి, ఎం డి. అబ్దుల్లా, జమాల్ షరీఫ్, మాజీదఫ్సర్, అల్లాడి ప్రభాకర్ రావు, ఎన్. రవీందర్, జి. ప్రమోద్కుమార్ గుప్త, కృష్ణాజీవన్ బజాజ్ తదితరులున్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ నాముని పావని కుమారి అన్నారు. శనివారం ధర్మకంచలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక జీవనానికి ప్రతీక బతుకమ్మ పండుగ అన్నారు. ప్రకృతిలో లభించే పువ్వులను ఆరాధించే పండుగే బతుకమ్మ అన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. తరతరాలుగా మహిళా సామూహిక శక్తికి ఐక్యతకు దర్పణమైన బతుకమ్మ పండుగ, తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల అస్తిత్వ ఆకాంక్షలకు వేదికగా నిలిచిందన్నారు . కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, భోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఆట, పాటలతో అలరించారు.



Local News




# గౌతమి ఒకేషనల్ కాలేజీలో బతుకమ్మ సంబురాలు

**చేర్యాల, మన చౌరాస్తా:** చేర్యాల మండల కేంద్రంలో గౌతమి ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పంతులు శివశంకర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు తెలంగాణ ఆడపడుచులకు ఇది అతి పెద్ద పండుగని, బతుకమ్మ పండుగ విశిష్టతను గుర్తించి నాటి ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించిందని, తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక జీవనానికి ప్రతీక ఈ బతుకమ్మ పండుగ అని, ప్రకృతిలో లభించే పువ్వులను ఆరాధించే పండుగ ఈ బతుకమ్మ పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు శ్రీనివాస్, శేఖర్,నర్సింహులు, పావని, రాజేష్, మనోజ్, రమ విద్యార్థులు పాల్గొన్నారు.




## అమ్మవారిని దర్శించుకున్న సీఐ

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల పట్టణంలోని చావడి వద్ద దేవి స్నేహ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో చేర్యాల సీఐ శ్రీను పాల్గొన్నారు. శనివారం అమ్మవారిని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీఐ మాట్లాడుతూ భక్తి భావంతో ఉంటే సత్ ప్రవర్తన మంచి అలవాట్లు అలవాడతాయని వీటి వల్ల ఒక మంచి సమాజం ఏర్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు బుక్క వీర సంతోష్ ప్రతినిధులు చందు, విక్కీ, వినయ్ నాని,రమేష్, హరి,శ్రావణ్ తదితరులు సేని సన్మానించారు అనంతరం గంప రాజు ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరగగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బచ్చన్నపేట ఎస్సైకి సన్మానం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేటలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై హమీద్ ను సిద్ధుల గుట్ట ఉత్సవ కమిటీ చైర్మన్ గాలి కృష్ణ , నాయకులు వెంకటేశ్, ప్రకాష్, విజయ్ కలిసి శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.





## మోషన్ జూనియర్ కాలేజీలో

**హనుమకొండ , మన చౌరాస్తా :** హన్మకొండ నయీమ్ నగర్ లోని మోషన్ జూనియర్ కాలేజీలో శనివారం బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా చేశారు. ఈ సందర్భంగా కాలేజీ చైర్మన్ వద్లకోండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మలో సంగీతం, సాహిత్యం, ఆటపాటలతో పాటు తెలంగాణ జీవన విధానం ఇమిడి ఉంటుందని అన్నారు. బతుకమ్మలో అనేక రంగు రంగుల పూలు, మనలోని ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా బతుకమ్మ జానపద సంస్కృతి తెలంగాణలో మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను అంతరించపోకుండా కాపాడవాల్సిన బాధ్యత మన అందరిది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మోషన్ కాలేజీ ప్రిన్సిపాల్ ముత్యాల సురేష్, కాలేజీ సిబ్బంది తాళ్లపెల్లి రమేష్ గౌడ్, అరుణ, శిల్ప, మమత, అరుణ్, కొడారి అనిల్, తదితరులు పాల్గొన్నారు.




## ‘ధరలు నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం’

**చేర్యాల, మన చౌరాస్తా :** విపరీతంగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను ప్రభుత్వం వెంటనే నియంత్రించాలని లేనిపక్షంలో ప్రజలందరూ పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో పిలుపునిచ్చారు. శనివారం రోజున సిపిఎం పార్టీ పోతిరెడ్డిపల్లి గ్రామ శాఖ మహాసభ పాల వెంకటేశం అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకట్ మావో మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నప్పటికీ బతుకమ్మ, దసరా,దీపావళి పండుగల సందర్భంగా నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకర మని, ధరలను పెంచడం అంటే ప్రజలను దోచుకోవడమే అని ఈ దోపిడీ విధానంపై పోరాడది ఒక సిపిఎం పార్టీ మాత్రమే అని ప్రజలందరూ సిపిఎం పార్టీనిర్వహించే ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.పోతిరెడ్డిపల్లి గ్రామంలో అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయని చెరువులు నింపేందుకు కాలువల నిర్మాణాలపై, పెదరాజపేట నుండి పోతిరెడ్డిపల్లి వరకు బీటీ రోడ్ నిర్మాణం కోసం గ్రామ ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు. గ్రామ శాఖ కార్యదర్శిగా గర్నపల్లి చంద్రం నూతనంగా తిరిగి ఎన్నుకున్నారు సోషల్ మీడియా బాధ్యునిగా పాల వెంకటేశం ని ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు గొర్రె శ్రీనివాస్ పట్టణ కమిటీ సభ్యుడు బోయిని మల్లేశం కత్తుల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి ఉత్తమ్‌ను పరామర్శించిన ఇందిర

హైదరాబాద్, మన చౌరాస్తా : రాష్ట్ర పౌర సరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని స్టేషన్ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర శనివారం పరామర్శించారు. కొండపూర్ లోని మంత్రి ఇంటికి వెళ్లి పురుషోత్తం రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉత్తమ్ తో పాటు ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని పరామర్శించారు.



మన చౌరాస్తా

06.10.2024 ఆదివారం
epaper.manachourasta.com

# దేవరుప్పలలో కేరళ బృందం

**దేవరుప్పుల , మన చౌరాస్తా :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కేంద్రాలను కేరళ సిపిఎం (యుటిఎఫ్) జితేష్ ఆధ్వర్యంలో సందర్శించారు.శనివారం దేవరుప్పుల మండలం లోని చారిత్రిక నేపథ్యం కలిగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు షేక్ బందగి, ఠాను నాయక్, దొడ్డి కొమురయ్య ప్రాంతాలను సందర్శించి జాటోతు దర్గా నాయక్ ను సన్మానించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సింగారపు రమేష్ , ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ , పాలకుర్తి మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, చిల్పుర్ మండల కార్యదర్శి సాదం రమేష్, ఎస్ డబ్ల్యూ యు ఎఫ్ జిల్లా నాయకులు జె నాగేశ్వరరావు, రాయల శ్రీనివాసరావు, జక్కంపూడి కృష్ణ కేరళ బృందానికి నాటి చరిత్రను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం పురిటి గడ్డను చూసి వారి హృదయం పులకించి పోయిందని తెలిపారు. సాయిధ పోరాటం ప్రపంచ చరిత్ర పుటల్లో లిఖించబడ్డదన్నారు. సిపిఎం పార్టీ నిర్వహిస్తున్న పోరాటాల వైపు దేశం ఎదురు చూస్తుందన్నారు. ఎర్రజెండా రాజ్యం వస్తేనే దేశంలో ప్రజలు బ్రతుకులు మారుతాయి అని. ఎర్రజెండా రాజ్య స్థాపన కోసం వీర తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు నిర్వహించాలన్నారు. రజాకారులను భూస్వాములను తరిమికొట్టి ఈ గడ్డమీద నాలుగు వేలమంది రక్తతర్పణ చేసింది కమ్యూనిస్టు యోధులేనని గుర్తు చేశారు.నిజం నిప్పులాంటిదని చరిత్రను వక్రీకరించే మతోన్మాదులకు ప్రజాక్షేత్రంలో ఎప్పటికైనా గుణపాఠం తప్పదని అన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని విస్మరించి మనువాద సిద్ధాంతాన్ని ఆచరిస్తుందని విమర్శించారు.వీర తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా 10 లక్షల ఎకరాల భూములు భూస్వాముల నుండి పేదలకు పంచబడ్డాయని




3వేల గ్రామాల్లో గ్రామ రాజ్యాలు ప్రజలు ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డి బిక్షపతి, బత్తిని వెంకన్న, ఐలన్న, గుడిశాల రాములు తదితరులు పాల్గొన్నారు.



# చండీ హోమంలో ఎమ్మెల్యే

పాలకుర్తి , మన చౌరాస్తా : పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ పున:ప్రారంభోత్సవ సందర్భంగా జరుగుతున్న చండీహోమంలో ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుమార్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

WANTED విలేకరులు కావలెను




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812

# స్టైలిష్ సమంత

**మన చౌరాస్తా, సినిమా :** చాలా కాలం తర్వాత ఇప్పుడిప్పుడే మరోసారి అడియన్స్ ముందుకు వస్తుంది హీరోయిన్ సమంత. అటు సోషల్ మీడియాలో వరుస ఫోటోషూట్స్ షేర్ చేస్తున్న సామ్.. ఇటీవలే సిటాడెల్ వెబ్ సిరీస్ టీమ్ మెంబర్స్‌తో సందడి చేసింది. సిటాడెల్ వెబ్ సిరీస్ ప్రమోషన్లలో భాగంగా గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రాతో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చింది. అలాగే తాజాగా సినీరంగంలో హీరోయిన్స్ ప్రతిష్టాత్మకంగా భావించే ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్ అందుకుంది. ఈ శుక్రవారం దుబాయ్ వేదికగా జరిగిన ఐఫా 2024 వేడుకల్లో ఈ పురస్కారాన్ని అందుకుంది సామ్. దీంతో ఆమెకు బాలీవుడ్, టాలీవుడ్ స్టార్స్ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఈ క్రమంలోనే గత నాలుగు రోజులుగా స్టైలీష్ లుక్స్ లో వరుస ఫొటోషూట్స్ చేస్తూ ఫాలోవర్లను ఆకట్టుకుంటుంది సామ్. ఈవెంట్స్, పార్టీలలో తన స్టైల్‌తో అందరిని ఆశ్చర్యపరుస్తుంది. ఇటీవలే ఓ ఈవెంట్‌లో సమంత తన సన్నిహితురాలు క్రేషా బజాజ్ రూపొందించిన అద్భుతమైన పాస్టెల్ గ్రీన్ కో-ఆర్డ్ సెట్‌తో అభిమానులను అలరించింది. గ్రీన్ స్టైలీష్ డ్రెస్సుకు తగినట్లుగా బంగారు చెవిపోగులను ధరించి మరింత స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. ఇక తన లుక్ కు తగినట్లుగా విలాసవంతమైన బల్గారీ సర్పెంటీ వాచ్ ధరించింది. ఈ వాచ్ సామ్ లుక్ ను మరింత అందంగా మార్చేశాయి. దీంతో ఆ వాచ్ ధర గురించి తెలుసుకోవడానికి నెట్టింట సెర్చింగ్ స్టార్ట్ చేశారు ఫ్యాన్స్. నివేదికల ప్రకారం సమంత ధరించిన లగ్జరీ బల్గారీ వాచ్ ధర రూ.45.5 లక్షలు అని తెలుస్తోంది. ఇదిలా ఉంటే.. సామ్ ఇటీవలే లండన్‌లోని సిటాడెల్ వరల్డ్ పార్టీకి హాజరయ్యారు. అక్కడ ఆమె మరోసారి అందరి లుక్ ను తనవైపు తిప్పకుంది. ఈసారి క్రేషా బజాజ్ రూపొందించిన అధునాతన నేవీ-బ్లూ డ్రెస్ లో కనిపించింది. కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సామ్.. సినిమాలు తగ్గించింది. నిత్యం యోగా, మెడిటేషన్ చేస్తూ తన ఫాలోవర్లకు సైతం ఆరోగ్య సూచనలు ఇస్తుంది.

